క్లుప్తంగా

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది

జబర్దస్త్ ఫేం వెంకీమంకీ



దామెర : అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని జబర్దస్త్ ఫేం వెంకీమంకీ అన్నారు. పరకాల, దామెర ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన దయ్యాల సదయ్య, బాలుగు లక్ష్మినివాసం ఆత్మీయ సన్మాన కార్యక్రమం మండలంలోని ఒగ్లాపూర్ డిస్నీల్యాండ్ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సదయ్య, లక్ష్మినివాసం దంపతులను పూర్వవిద్యార్థులు, బంధుమిత్రులు పూలమాలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన సభకు జబర్దస్త్ ఫేం, సినీ నటుడు వెంకీమంకీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సదయ్య, లక్ష్మినివాసం బోధనలతో ఎంతో మంది విద్యార్థులు ఉన్నస్థానాలు అధిరోహించారని కొనియాడారు. ఎంతో మంది విద్యార్థుల్లో చెరగని ముద్రవేశారని అన్నారు. ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని, వృత్తికి మాత్రమే విరమణ ఉంటుందికానీ మనసుకి కాదన్నారు. విద్యార్థులు ఉన్నతంగా స్థిరపడినప్పుడే ఉపాధ్యాయుడికి నిజమైన సంతోషమన్నారు. ఉపాధ్యాయుల సూచనలు విని విద్యార్థులు నడుచుకోవాలని, జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకుని సాధించేందుకు కష్టపడాలని అన్నారు. వ్యసనాలకు బానిస కాకుండా చెడు స్నేహానికి దూరంగా ఉండాలన్నారు. డిస్నీల్యాండ్ పాఠశాలకు ముఖ్య సలహాదారులుగా కొనసాగుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిస్నీల్యాండ్ పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి, డైరెక్టర్లు రాకేశ్ భాను, దినేష్ చందర్ మీన, హరితభాను రాజు, బుద్ధదేవ్‌సూజ్ శ్రావణి, పవన్‌కుమార్ రజిత, మౌనిక ఈశ్వర్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షాతిరేకాలు

- 30 ఏళ్ల కల నెరవేరిందని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకుల సంబురాలు
- బాణసంచా కాల్చి, స్వీట్ల పంపిణీ
- మంద కృష్ణమాదిగ చిత్రపటానికి, అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

కమలాపూర్ : ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి వద్ద గురువారం ఎంఎస్పీ మండల శాఖ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ హాస్టల్‌లో మాదిగ అమరవీరులకు నివాళులర్పించి విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు చిలువేరు సంపత్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ జరిగితేనే ఎస్సీలు, ఎస్సీ ఉపకులాలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, ఉద్యోగ పరంగా అభివృద్ధి చెందుతారని భావించిన మంద కృష్ణమాదిగ ఎమ్మార్పీఎస్ స్థాపించి ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. 30 ఏళ్ల ఆయన పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు సంతోషకరమన్నారు. అంతకుముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఎంఎస్పీ మండల అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా కార్యదర్శి రవీందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి, మండల ఇన్‌చార్జ్ రాజు, మండల అధ్యక్షుడు రాజు, నాయకులు స్వామి, రాజమల్లు, శ్రీనివాస్, రమేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



కమలాపూర్ : మాదిగ అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

పరకాలలో..

హన్మకొండ (పరకాల) : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన తొలి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవడం గర్వకారణమని పరకాల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి అన్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రజాసంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి సంబురాలు జరుపుకొన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు చిన్ని, ఎస్సీసెల్ నడికూడ అధ్యక్షుడు శనిగరపు సాంబయ్య, నాయకులు మొగిలి, సదన్‌కుమార్, రవీందర్, రవి, రమేశ్, చెంగల్‌రావు, రవికుమార్, సంపత్ పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మండల కేంద్రంలో విజయోత్సవ సంబురాలు చేసుకున్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బొక్కల నారాయణ, ప్రవీణ్, రమేశ్, చంద్రమౌళి, రహీం, సుమన్, శోభన్, ఏలియా, కైలాసం, ప్రణయ్, అరుణ్, రాజేందర్, వీరన్న, దివాకర్, రాజు, శ్రీనాథ్, ఉదయ్ సింహ, వినయ్, సుమన్, రాజు, చేరాలు, కిషన్, సామేల్, యాదక్క, సుధాకర్, దేవేందర్, ప్రవీణ్, కైలాసం పాల్గొన్నారు.



ఐనవోలు : సంబురాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ధర్మసాగర్‌లో..

వేలేరు (ధర్మసాగర్) : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో ఎమ్మార్పీఎస్ శ్రేణులు గురువారం టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచుతూ సంబురాలు జరుపుకొన్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బొడ్డు శాంతిసాగర్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణలో ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ 30 సంవత్సరాల పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని అన్నారు. అదే విధంగా నారాయణగిరి గ్రామంలో ఎమార్పీఎస్ జిల్లా నాయకుడు వక్కల ప్రభాకర్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకొన్నారు. మాచర్ల బాబు, శివ, దేవరాజు, ప్రణయ్‌భాస్కర్, రాజు, మధు, వినయ్ పాల్గొన్నారు.



శాయంపేట : ఎమ్మార్పీఎస్ నాయకులకు స్వీటు తినిపిస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

శాయంపేటలో..

శాయంపేట : సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు రావడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఫ్లెక్సీకి గురువారం పాలాభిషేకం చేశారు. ఎస్సై ప్రమోద్‌కుమార్, ఎంపీడీఓ ఫణిచంద్ర, వివిధ శాఖల అధికారులకు స్వీట్లు పంపిణీ చేశారు.

పారిశుద్ధ్య పనులపై దృష్టిసారించాలి



హన్మకొండ (పరకాల) : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని పరకాల మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కె.వెంకటనారాయణ కోరారు. మండల పరిధిలోని గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఉద్యోగులతో గురువారం ఆయన వర్షాలు, సీజనల్ వ్యాధులపై సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయని అన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. జ్వరం వస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలని, నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, ఎంపీఓ ఇమ్మడి భాస్కర్, కార్యాలయ సూపరిండెంట్ శైలశ్రీ, ఏపీఓ ఇందిర, ఏపీఎం క్రాంతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవల్ని వినియోగించుకోవాలి

వేలేరు (ధర్మసాగర్) : ఆర్టీసీ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ మోహన్‌రావు, డిపో మేనేజర్ ధరమ్ సింగ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ధర్మసాగర్ మండలంలోని పెద్దపెండ్యాల గ్రామం నుంచి హనుమకొండ వరకు ఆర్టీసీ బస్సును ప్రారంభించి మాట్లాడారు. గ్రామం నుంచి బస్సు సర్వీసు ప్రారంభించడం వలన పాఠశాలకు, కళాశాలకు వెళ్లే విద్యార్థులకు ఎంతగానో మేలు జరుగుతుందని అన్నారు. మహిళలు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు. గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడంతో మహిళలు, కాంగ్రెస్ నాయకులు కోలాటంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర కృషితోనే గ్రామానికి ఆర్టీసీ బస్సు వచ్చిందన్నారు. ప్రజలకు రవాణా కష్టాలు తప్పాయని అన్నారు. ఆర్టీసీ సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజారపు యాదగిరి, మాజీ సర్పంచ్‌లు స్రవంతి, అన్నమ్మ, అనిల్, మాజీ ఎంపీటీసీ నాగరాజు, నాగయ్య, రవి, గ్రామశాఖ అధ్యక్షుడు భిక్షపతి, సాంబయ్య, కిశోర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

స్థాయికి మించి వైద్యం చేయొద్దు

ఖిలా వరంగల్: ఆర్‌ఎంపీలు, పీఎంపీలు తమ స్థాయికి మించిన వైద్యం చేయొద్దని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘాల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్ఎన్.హరిబాబు సూచించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర శ్రీనివాస్ అధ్యక్షతన వరంగల్ రంగశాయిపేటలోని పద్మశాలి భవనంలో మండల కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ వైద్య సేవలు అందుబాటులో లేని గ్రామీణ ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలపై మెడికల్ కౌన్సిల్ సభ్యులు దాడి చేసి కేసులు నమోదు చేయటం సరికాదని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామగోని శ్యాంప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఏ.వెంకటేశ్వర్లు, బి.మహేందర్, ప్రధాన కార్యదర్శిగా రాజేంద్రప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్, రవికుమార్, వెంకటేష్, కోశాధికారిగా సుధాకర్, సలహాదారులుగా రమేష్, ఆర్గనైజర్లుగా యాకయ్య, నవీన్‌కుమార్, సభ్యులుగా లింగమూర్తి, రమేష్‌బాబు, విద్యాసాగర్, సంజీవ, సమ్మయ్య, హరిప్రసాద్, శ్రీనివాస్, రమేష్, పాషా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ వైద్య ప్రతినిధులు బండి రమేష్, రాజిరెడ్డి, రమేష్, గజ్జెల్లి రవీందర్, హనుమయ్య, కైలాసం పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఎల్కతుర్తి : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



కమలాపూర్ : ఆటో ర్యాలీ నిర్వహిస్తున్న డ్రైవర్లు

ఎల్కతుర్తి : ప్రపంచ ఆటోకార్మికుల దినోత్సవాన్ని మండల కేంద్రంలోని ఆటోయూనియన్ నాయకులు గురువారం ఘనంగా జరుపుకొన్నారు. బస్టాండ్ సమీపంలో కేక్ కట్‌చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వలన ఆటోకార్మికులు జీవనోపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా సుమారు 15 వందల మంది ఆటోకార్మికులు జీవనోపాధి కోల్పోయారని అన్నారు. ఆటో ఫైనాన్స్ కట్టలేక, తమ పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి ఆటోకార్మికులకు నెలకు రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు లోకిని తిరుపతి, ఉపాధ్యక్షుడు అంచనగిరి రవి పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం నెలకు రూ.10 సాయం అందించాలని జై హనుమాన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు కూనూరు రవి కోరారు. కమలాపూర్‌లో గురువారం జై హనుమాన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక బస్టాండ్ కూడలి నుంచి పనగట్ల వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రవి మట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన కారణంగా ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయారని అన్నారు. పలువురు ఆటో డ్రైవర్లు కుటుంబ పోషణ భారమై, ఆటో కిస్తీలు చెల్లించలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తానని ప్రకటించాలని కోరారు.

సంక్షిప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్, సిబ్బంది

కమలాపూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది గురువారం బాధ్యతలు స్వీకరించారు. గోవిందరావుపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, మండల నోడల్ అధికారిగా విధులు నిర్వర్తించిన పి.వెంకటేశ్వర్లు కమలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు వివిధ కళాశాలల్లో పని చేసిన అధ్యాపకులు ఇ.శ్రీనివాస్‌రెడ్డి (రసాయన శాస్త్రం), బి.కవిత (జంతుశాస్త్రం), పి.శారద (వృక్షశాస్త్రం), కె.రజిత (హిందీ), ఎ.జ్యోతి (చరిత్ర), ఒ.సరోజన (ఆంగ్లం), కుమార్ (పౌరశాస్త్రం), అధ్యాపకేతర సిబ్బంది చంద్రమౌళి, లలిత, స్వర్ణలత, వజయేందర్, రమ తదితరులు బదిలీపై వచ్చారు.

కమలాపూర్‌లో తహసీల్దార్..

కమలాపూర్ : తహసీల్దార్‌గా ఎం.సురేష్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో సూపరిండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనను కమలాపూర్ తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సురేష్‌కుమార్ బాధ్యతలు స్వీరించారు. ఈ సందర్భంగా ఆయకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు.

కూరుకుపోయిన లారీ



వేలేరు : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఇటీవల నూతనంగా నిర్మించిన కల్వర్టుపై పోసిన మొరం బురదమయంగా మారింది. ఎరువుల లోడ్‌తో వేలేరు వైపు వస్తున్న లారీ బుధవారం రాత్రి కూరుకుపోయింది. రోడ్డుపై లారీ కూరుకుపోవడంతో ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలేరు నుంచి కొత్తకొండకు వెళ్లే రోడ్డు కొద్దిదూరం పూర్తిగా అధ్వానంగా మారిందని, సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాని వాహనదారులు కోరుతున్నారు.

'మందుబాబులకు అడ్డాగా ప్రకృతివనం'

నడికూడ : మొక్కలు పెంచడంతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కోసం గత ప్రభుత్వం శ్రీకారం చుట్టిన పల్లె ప్రకృతివనం మందుబాబులకు అడ్డాగా మారుతోంది. మండల కేంద్రంలోని పల్లె ప్రకృతివనంలో తరుచు ఈ సంఘటన వెలుగుచూస్తోంది. మందుబాబులు మద్యం తాగి సీసాలను పగులగొట్టడంతో అటుగా వెళ్తున్న పాదాచారులకు గాయాలు తప్పడం లేదు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేదని పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎన్ఎస్‌యూఐ ఉపాధ్యక్షుడిగా శేఖర్

శాయంపేట : ఎన్ఎస్‌యూఐ మండల ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన తూర్పాటి శేఖర్‌ను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇదివరకు కొనసాగిన రఘువర్మ రాజీనామా చేయడంతో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశాల మేరకు తూర్పాటి శేఖర్‌ను నియమించినట్లు తెలిపారు. అనంతరం శేఖర్‌ను పార్టీ కండువ కప్పి సన్మానించారు.

విద్యార్థులకు టై, బెల్ట్‌ల పంపిణీ

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి, ప్రస్తుత బయ్యారం ఎస్సై కోగిల తిరుపతి గురువారం పాఠశాలలోని 60 మంది విద్యార్థులకు టై, బెల్ట్, బ్యాడ్జీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. నిరుపేద విద్యార్థులకు తనవంతు సహకారం అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువులో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు కుమారస్వామి, రఘోత్తంరెడ్డి, గ్రామ పెద్దలు సంపత్, సంతులు ఎస్సై తిరుపతిని అభినందించారు.

బదిలీ ఎఫ్ఆర్‌ఓకు సన్మానం

కమలాపూర్ : ఎల్కతుర్తి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా పని చేసి బదిలీపై వెళ్తున్న మయూరిని కమలాపూర్ మండల సామిల్, టింబర్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. సామిల్, టింబర్ మర్చంట్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు దాసి శంకరయ్య, గంగు ప్రభాకర్‌రావు, బైరి దశరథం, చెంగెల్లి సుదర్శన్, నేరెళ్ల అశోక్‌గౌడ్, విద్యాసాగర్, నేరెళ్ల ఎల్లాగౌడ్, మెండు రాజు, బైరి రాజమౌళి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

వేలేరు : మండలంలోని పీచర గ్రామంలో దోమల నివారణకు గురువారం సాయంత్రం గ్రామపంచాయతీ సిబ్బంది ఫాగింగ్ చేపట్టారు.

నియామకం

ఆత్మకూరు : బీజేపీ మండల ప్రధానకార్యదర్శులుగా మండల కేంద్రానికి చెందిన బయ్యాపైడి ఆచార్య, పెంచికలపేటకు చెందిన ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డిని నియమిస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు బలవంతుల రాజు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు.

గుప్పుమంటున్న గుడుంబా

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గుడుంబా వాసన గుప్పుమంటోంది. ఎక్కడ చూసినా గుడుంబా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గ్రామాల్లో రహదారుల సమీపంలోనే గుడుంబా అమ్మకాలు జరుపుతున్నా పట్టించుకునే వారు లేరని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అక్కంపేట గ్రామానికి గీసుకొండ మండలం నుంచి గుడుంబా రవాణా చేస్తున్నట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది. కాయకష్టం చేసుకునే కూలీలు వారి డబ్బులను గుడుంబా విక్రయ కేంద్రాల్లో ఖర్చు చేస్తున్నారని, కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందని మహిళలు ఆగ్రహిస్తున్నారు. గుడుంబా అమ్మకాలు జరిపితే సహించేది లేదని, గుడుంబా తయారీ, విక్రయదారులపై కఠినంగా వ్యవహరించాలని స్థానిక ఎమ్మెల్యే పలుమార్లు అధికారులకు సూచించినా ఫలితం లేదని, అధికారులు పెడచెవిన పెడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గుడుంబా అమ్మకాలను అరికట్టాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని స్థానిక మహిళలు హెచ్చరించారు.

సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి

- భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు
- సీఎం దిష్టిబొమ్మ దహనం
- వేలేరులో బీఆర్ఎస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట



వేలేరు : పోలీసులు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య చోటుచేసుకున్న తోపులాట

ఎల్కతుర్తి: అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ పార్టీ మహిళా ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు గురువారం హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిపై సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై రాజ్‌కుమార్ సిబ్బందితో అక్కడకు చేరుకొని ఆందోళనకారులను నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు. పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్, సింగిల్‌విండో చైర్మన్ రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింగరావు, మాజీ జెడ్పీటీసీ చాడ సరిత డిమాండ్ చేశారు. గురువారం బీఆర్ఎస్ అధిష్టానం పిలుపు మేరకు మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ నాయకులకు, పోలీస్‌లకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. మాజీ సర్పంచ్ మాధవరెడ్డి పాల్గొన్నారు.



హన్మకొండ (పరకాల) : నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

పరకాలలో..

హన్మకొండ (పరకాల) : బీఆర్ఎస్ మహిళ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునితారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు పరకాల పట్టణంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, నాయకులు నాగరాజు, శ్రీను, నవీన్, రాజేందర్, భిక్షపతి, కళావతి, తెలంగాణ కుమార్, రవి పాల్గొన్నారు.



ఎల్కతుర్తి : సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

శాయంపేటలో..

శాయంపేట : అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునితాలక్ష్మారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెంటనే క్షమాపన చెప్పాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని ఆరోపించారు.

పిల్లలకు తల్లిపాలే శ్రేష్ఠం



దామెర : మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

దామెర : పసిపాపల ఆరోగ్యానికి తల్లిపాలే అమృతధారలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం మండలంలోని పులుకుర్తిలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంతరాలను తొలిగించి తల్లిపాల ప్రాముఖ్యతను చాటాలని పిలుపునిచ్చారు. పుట్టిన గంటలోపు శిశువుకు ముర్రుపాలు పట్టించాలని అన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టించాలని, పిల్లల ఆరోగ్యానికి తల్లిపాటే శ్రేష్ఠమని అన్నారు. శ్రామిక, ఉద్యోగం చేసే మహిళలకు తల్లిపాలు నిల్వ చేసే విధానంపై అవగాహన కల్పించారు. డబ్బా పాలు పట్టించడం వలన కలిగే అనర్థాలను వివరించారు. తల్లి పాలు తాగించడం వలన పోషణలోపం లేకుండా ఆరోగ్యంగా ఎదుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం శోభారాణి, అంగన్‌వాడీ టీచర్లు వాణి, శోభ, సరళ, జయ, ఉదయ, కోమల, జ్యోతి, పుష్పలీల, ఫాతిమా, రమ పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : పాప పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాగించాలని, వాటితో నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సునిత, మంజుల అన్నారు. మండలంలోని మైలారం, ప్రగతిసింగారం గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధానవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పిల్లలతో మొక్కలు నాటించారు.

పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేయాలి



వేలేరు : మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న పనులను మండల ప్రత్యేకాధికారి మల్లయ్య, ఎంపీడీఓ లక్ష్మిప్రసన్న గురువారం పరిశీలించారు. మండలంలోని కేజీబీవీ, గురుకుల పాఠశాల, ప్రభుత్వ పాఠశాలలో పనులను పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం అందించాలని సూచించారు. వారి వెంట పీఆర్ ఏఈ రూప ఉన్నారు.